పదిలో '12'వ స్థానం

- రాష్ట్రంలో మెదక్ జిల్లా స్థానం
- 10,370 మందికి 10,045 మంది ఉత్తీర్ణత
- జిల్లా వ్యాప్తంగా 96.87 శాతం ఉత్తీర్ణత నమోదు
- బాలికలదే హవా
- బాలికల ఉత్తీర్ణత శాతం 97.73, బాలుర ఉత్తీర్ణత శాతం 95.94

అదనపు కలెక్టర్‌ను కలిసి మొక్కను అందిస్తున్న డీఈవో రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో బాలికలు హవా చాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో మెదక్ జిల్లా 96.87 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచింది. గతేడాది 18వ స్థానంలో నిలిచిన జిల్లా ఈసారి మరో ఆరు స్థానాలు పైకెళ్లి 12వ స్థానంలో నిలువడం గమనార్హం. ఈ ఏడాది మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. జిల్లాలో 68 పరీక్ష కేంద్రాల్లో 10,370 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 10,045 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4,994 మందికి 4,791 మంది ఉత్తీర్ణులు కాగా (95.94 శాతం), బాలికలు 5,376 మందికి 5,254 (97.73 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ తెలిపారు.

114 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత..

మెదక్ జిల్లాలో 114 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో 86 ప్రభుత్వ పాఠశాలలు, 28 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో 140 జడ్పీహెచ్ పాఠశాలలు ఉండగా, ఇందులో 60 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాలలు 2 ఉండగా, రెండింటిలోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని 21 మండలాల్లో మాసాయిపేట, నిజాంపేట మండలాలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. మెదక్ జిల్లా కేంద్రంలోని సిద్దార్థ్ పాఠశాలకు చెందిన దీపక్‌గౌడ్ 600 మార్కులకు 582 మార్కులు సాధించగా.. మనోహరి, ఆఫ్షిన్ ఫాతిమా 581 మార్కులు సాధించారు. ఈనెల 24వ తేదీన వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో బాలికలే హవా కొనసాగగా.. 'పది' ఫలితాలల్లోనూ వారిదే హవా కొనసాగింది.

రీకౌంటింగ్‌కు..

రీకౌంటింగ్ కోరే అభ్యర్థులు ఫలితాలు వెలువడిన రోజు నుంచి సబ్జెక్టుకు రూ.500 చొప్పున ఫీజు 15 రోజుల్లోగా చలాను ద్వారా చెల్లించాలన్నారు. రీ వెరిఫికేషన్ కోసం ఒక సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని డీఈవో రాధాకిషన్ తెలిపారు.

జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు..

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ఫీజు మే 16వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుంది.

మూడేండ్లలో జిల్లాలో 'పది' ఫలితాలు..

2021-22 సంవత్సరంలో 94.44 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 11వ స్థానంలో నిలువగా.. 2022-23 సంవత్సరంలో 13వ స్థానంలో, 2023-24 సంవత్సరంలో 18వ స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం 12వ స్థానంలో నిలిచిం ది. డీఈవో రాధాకిషన్ బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పది ఫలితాలను వివరించారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఉన్నారు.

దీపక్‌గౌడ్(582), ఫాతిమా(581)

అధికారుల పనితీరులో మార్పురావాలి

- స్వచ్ఛ సిద్దిపేటకు అందరూ సహకరించాలి
- వార్డు ఆఫీసర్ల పనితీరు బాగుంటే...వార్డు బాగుంటుంది
- వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 30:అధికారుల పనితీరులో మార్పురావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూచించారు. పట్టణంలో చెత్త పేరుకుపోయిందని, బ్లాక్ స్పాట్లను వెంటనే తొలించాలని, మున్సిపల్ అధికారులు శానిటైజేషన్ పై దృష్టి సారించాలన్నారు. బుధవారం సిద్దిపేట పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సుతో కలిసి వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు తమ వార్డుల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ దేశ స్థాయిలో సిద్దిపేట పట్టణానికి మంచి గుర్తింపు ఉందని, అందరూ కలిసి కట్టుగా పనిచేసి సిద్దిపేట పేరు జాతీయ స్థాయిలో నిలిపేలాపనిచేయాలన్నారు..వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వాటర్ ట్యాంక్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. పట్టణంలోని 2వ వార్డు నర్సాపూర్,15వ వార్డు ఇమాంబాద్, మొదటి వార్డు లింగారెడ్డి పల్లి ,ఇందిరమ్మ కాలనీలోని పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సిద్దిపేట మున్సిపాలిటీకి నూతనంగా వచ్చిన వార్డు ఆఫీసర్లు కష్టపడి కాకుండా ఇష్టపడి చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో విద్యుత్, మున్సిపల్ సిబ్బంది ఇష్టానుసారంగా చెట్లను నరకడం, అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్ రూమ్‌కాలనీలో సబ్ స్టేషన్ పనులపై ఆరా తీశారు. ఇందిరమ్మ కాలనీ బీటీ రోడ్ల పనులు, లింగారెడ్డిపల్లి బ్రిడ్జి పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతుందని ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని శ్మశాన వాటికలో డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని కొంతమంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకురాగా వెంటనే వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్లకు సూచించారు.సమావేశంలో పాలకవర్గం సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

మెదక్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ జగదీశ్, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, రవాణా శాఖ అధికారులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యాసంగిలో 54.89 లక్షల ఎకరాల్లో వరి సాగైందన్నారు. 1.37 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.55 లక్షల రైతుల నుంచి 19.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, వీరికి రూ.2,289 కోట్లు మద్దతు ధర కింద చెల్లించామని, యాసంగి పంట కింద ఇప్పటివరకు కొనుగోలు చేసిన 8.8 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని తెలిపారు. మేలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం రానున్న నేపథ్యంలో, అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రానున్న 20 రోజులపాటు సజావుగా ధాన్యం కొనుగోళ్లు చేయడం అత్యంత ప్రాధాన్యత అంశమని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి లోటుపాట్లు ఉండటానికి వీల్లేదన్నారు.

ధాన్యం వెంటనే దించుకోవాలి: ఆర్డీవో

నర్సాపూర్, ఏప్రిల్ 30: రైస్‌మిల్లులకు వచ్చే లోడును వెంటనే దించుకొని లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపించాలని ఆర్డీవో మహిపాల్‌రెడ్డి రైస్‌మిల్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లిలోని వేంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సరిపడా టార్పాలిన్లు సమకూర్చాలి

నర్సాపూర్, ఏప్రిల్ 30: కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ల సంఖ్య 30 వరకు పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు కేంద్రం సిబ్బందికి సూచించారు. బుధవారం బ్రాహ్మణపల్లి, తుజాల్‌పూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టార్పాలిన్లు సంబంధిత ఏఎంసీ నుంచి తెచ్చుకోవాలని సూచించారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం దించుకోకపోతే జిల్లా అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయాలని, మిల్లర్స్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. వీరితో పాటు సీసీ రవీందర్, కమిటీ మెంబర్ లావణ్య, సుమలత, సీఏ నవనీత ఉన్నారు.

ధాన్యం వెంటనే అన్‌లోడ్ చేయాలి

రామాయంపేట, ఏప్రిల్ 30 : రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యం నిల్వ ఉంచొద్దని, వెంటనే అన్‌లోడ్ చేయాలని రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి రైస్‌మిల్లర్లకు సూచించారు.పట్టణ శివారులోని బాలాజీ రైస్‌మిల్లును తహసీల్దార్ రజినీకుమారి తనిఖీ చేపి సూచనలు చేశారు. ధాన్యంతో లారీలు మిల్లుకు రాగానే వెంటనే అన్‌లోడ్ చేసి రికార్డులో నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ గౌస్ తదితరులు ఉన్నారు.

గొప్ప సాంఘిక సంస్కర్త బసవేశ్వరుడు

మెదక్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడు అని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ కొనియాడారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బసవేశ్వరుడు బోధించిన అభ్యుదయవాద సంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందన్నారు. 12వ శతాబ్దంలోనే ఆయన మహిళలకు సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు.సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడని, ఆయన చూపిన మార్గంలో మనమందరం నడవాలని కోరారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజం ప్రధాన కార్యదర్శి వీరేశం, గౌరవాధ్యక్షుడు ఆనందం, కోశాధికారి ప్రభు, సలహాదారు సిద్దన్న, సంగమేశ్వర్, జంగమ సమాజం గౌరవ అధ్యక్షుడు బసవలింగం, కోశాధికారి పరమేశ్వర్, పట్టణ అధ్యక్షుడు భీమప్ప, సలహాదారులు బసవరాజ్, మహలింగం, మహేశ్, సతీశ్, విజయ్ పాల్గొన్నారు.

అభ్యుదయవాది బసవేశ్వరుడు

చిన్నశంకరంపేట,ఏప్రిల్ 30: మండల తహసీల్ కార్యాలయంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడని పేర్కొన్నారు. ఆయన బోధించిన అభ్యుదయవాద సాంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందన్నారు. సమాజ స్థాపక కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు అని, ఆయన చూపిన మార్గంలో మనమందరం నడవాలని కోరారు.

దాతలకు సన్మానం



దాతలను సన్మానిస్తున్న శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్ గౌడ్

శివ్వంపేట, ఏప్రిల్ 30: శివ్వంపేట మండలం గూడూరు గ్రామ శ్రీగురుపీఠంలో నిర్మించే షిర్డీ సాయిబాబా మందిర గోపురానికి బంగారు కలశాన్ని, బంగారు యంత్రాలను సొంత ఖర్చులతో సమర్పిస్తానని హామీ ఇచ్చిన హైదరాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్, వనజ దంపతులను శ్రీగురుపీఠం చైర్మన్ జిన్నారం శివకుమార్‌గౌడ్ సాయిబాబా జన్మస్థలం పత్రి నుంచి తెచ్చిన శాలువాలతో సత్కరించారు. గూడూరులో నిర్మించే శ్రీగురుపీఠం చరిత్రలో మిగిలిపోనుందని, దాదాపు వంద సంవత్సరాల వరకు కలశాలు చెక్కు చెదరవని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ రోజు భక్తులకు విజయ్‌కుమార్,వనజ దంపతులు అన్నప్రసాద వితరణ చేస్తామని హామీ ఇచ్చినట్టు ట్రస్టు చైర్మన్ తెలిపారు. త్వరలోసాయిబాబా, దత్తాత్రేయ మహాస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. పురోహితులు వామన శర్మ, శ్రీగురుపీఠం ట్రస్టు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, నోముల హనుమంతు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న 'గీతా' యాజమాన్యం

'గీతా' విద్యార్థుల ప్రభంజనం

నిశాంత్ (588), చక్రవర్ధన్ రెడ్డి(585)

తూప్రాన్, ఏప్రిల్ 30 : బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో తూప్రాన్‌కు చెందిన గీతా విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. పి.నిశాంత్ 588/600(హాల్ టికెట్ నెం.2517105844), కె.చక్రవర్ధన్ 585/600 మార్కులతో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. 28 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, కె.నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రమాదవశాత్తు పంట దగ్ధం

చిలిపిచెడ్, ఏప్రిల్ 30: ప్రమాదవశాత్తు వరి పంట దగ్ధమైన సంఘటన చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు,రైతుల వివరాల ప్రకారం చిట్కుల్‌కు చెందిన తుపాకీ వీరేశం,రాములు,ఇతర రైతులకు చెందిన వరి పంట మంటలు రేగి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వెంటనే రైతులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సంగారెడ్డి జిల్లా అందోల్-జోగిపేట పట్టణ ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి అదుపు చేశారు. రైతు వీరేశానికి చెందిన రెండు ఎకరాల వరి పంట పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసి కేసు నమోదు చేశారు.

పేస్కేల్ అమలు చేయాలి

నిజాంపేట, ఏప్రిల్ 30: నిజాంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి ఎంపీడీవో రాజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వేతనాల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పేస్కేల్ విధానాన్ని అమలు చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్స్ రవితేజ, మమత, సీవోలు అనిల్, శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

చేగుంట,ఏప్రిల్ 30: రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా చేగుంట పోలీసు స్టేషన్ పరిధిలోని బొమ్మారం గేట్ వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది.చేగుంట పోలీసుల వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా గ్రామానికి చెందిన కలీల్ బాషా(38) హైదరాబాద్ బాల్‌నగర్ నుంచి మినీ వ్యాన్‌లో భీంగల్‌కు మెడిసిన్ తీసుకు వస్తుండగా , బొమ్మారం గేట్ వద్దకు రాగానే వ్యాన్ అదుపు తప్పి డివైడర్‌కు తగిలి కిందపడి పోవడంతో కలీల్ భాషా అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు షేక్ హైమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

స్టేడియంలో వాటర్ ప్యూరీఫైర్ ఏర్పాటు

వాటర్ ప్యూరీఫైర్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 30: మెదక్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో యంగ్‌స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరీఫైర్‌ను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ.. స్టేడియానికి వచ్చే క్రీడాకారుల కోసం స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో యంగ్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. ముమ్ముందు ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, యంగ్ స్టార్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రాగి వనజ, కార్యదర్శి సౌమ్య, కోశాధికారి సౌమ్య తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

నీలకంఠం సేవలు అభినందనీయం

నీలకంఠంను సత్కరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 30: విద్యాశాఖలో వివిధ హోదాలు, మెదక్ మండలంతోపాటు తొమ్మిది మండలాలకు విద్యాధికారిగా, జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శిగా సేవలందించిన నీలకంఠం సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. నీలకంఠం ఉద్యోగ విరమణ చేయడంతో బుధవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఆదనపు కలెక్టర్ నగేశ్, డీఈవో రాధాకిషన్‌తో కలిసి శాలువా, పూలమాలలతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి నవీన్, విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్ రాజ్, అసిస్టెంట్ సెక్రెటరీ సదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో సత్తాచాటిన విష్ణు విద్యార్థులు

మిర్జాబేగ్ (584), సాయిభవాని (574)

నర్సాపూర్, ఏప్రిల్ 30: నర్సాపూర్ పట్టణ సమీపంలోని విష్ణు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు బుధవారం విడుదలైన ఎస్సెస్సీ ఫలితాల్లో సత్తాచాటారు. మొత్తం 55 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. పదో తరగతికి చెందిన మరియం మిర్జాబేగ్ 600 మార్కులకు 584 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రద్ధశ్రీ 579, సాయిశ్రీజ 574, సాయిభవానీ 574 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. నలుగురు విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించారు. పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు కె.జామి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు.

లారీలు రాక రైతులకు తప్పని తిప్పలు

బద్రియ తండా కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు

చిలిపిచెడ్, ఏప్రిల్ 30: ఒకవైపు ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయని రైతులు ఆవేదన చెందుతుండగా..తూకం వేసిన ధాన్యాన్ని తరలించడంలోనూ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.లారీలు రాకపోవడంతో కేంద్రాల్లోనే ధాన్యం బస్తాలు మూలుగుతున్నాయి.ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు వెళ్తున్నాయా.. లేదా..అని అడిగే అధికారులే లేకుండా పోయారని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్, బద్రియ తండాలో కొనుగోలు కేంద్రంలో రెండు రోజుల క్రితం ధాన్యం తూకం వేశారు. ధాన్యం కోసం లారీలు రాకపోవడంతో కేంద్రంలో ధాన్యం బస్తాలు ఉన్నాయి. తూకం వేసిన బస్తాలు వర్షానికి తడిసిపోతే ఎవరూ బాధ్యత వహిస్తారని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా లారీలు తుచ్చి తూకం వేసిన బస్తాలను తరలించాలని రైతులు కోరుతున్నారు.

టాపర్‌గా తూప్రాన్ విద్యార్థిని..

తూప్రాన్, ఏప్రిల్ 30 : బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో తూప్రాన్ శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థిని కొక్కొండ శ్రీనిధి 590/600 మార్కులతో (హాల్ టికెట్ నెం.2517105971) జిల్లా టాపర్‌గా నిలిచింది. రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. తూప్రాన్ మండల విద్యార్థిని జిల్లా టాపర్‌గా నిలవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్ యాక్ట్ అమలు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 30: జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని మే 1వ తేదీ నుంచి 31 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఆయన హెచ్చరించారు.

హోంగార్డు కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

హోంగార్డు కుటుంబానికి
అండగా ఉంటాం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 30:గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు మహేందర్ కుటుంబానికి పోలీస్ శాఖ తరపున అండగా ఉంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో హోంగార్డు కుటుంబానికి జిల్లా పోలీస్ సిబ్బంది రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

హుస్సేన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రిన్సిపాల్‌కు ప్రమోషన్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 30: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలంగాణ కళాశాల విద్యాశాఖ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. బుధవారం కళాశాల అధ్యాపకులు హుస్సేన్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సింహారెడ్డి, శరత్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, వామనమూర్తి, చంద్రశేఖర్, నాగేందర్‌రావు, శ్రీలత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

4న చదరంగం పోటీలు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 30 : మెదక్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న మెదక్‌లో సాయ్ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-7, 11 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల చెస్ క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో 4వ తేదీ ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.